క్లుప్తంగా

నేడు బాలగంగమ్మ తల్లి నెలకొలుపు

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి సమీపంలో ఉన్న గార్లపాడు పునరావాస కాలనీలో శుక్రవారం బాలగంగమ్మ తల్లి నెలకొలుపు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం అమ్మవారికి పొంగళ్లు చెల్లిస్తారని, సాయంత్రం విద్యుత్ ప్రభ ఏర్పాటు చేస్తారని చెప్పారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

అభయాంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న గ్రామస్తులు

ఒంగోలు రూరల్: మండలంలోని ఉలిచి గ్రామంలో అభయాంజనేయస్వామి 18 అడుగుల రాతి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు గురువారం శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు. మంగళగిరి శివస్వాముల పర్యవేక్షణలో భూమి పూజ చేయగా, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం



పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న స్వాములు

ఒంగోలు టౌన్: నృసింహ జయంతి వేడుకలను ఒంగోలు నగరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కేశవస్వామిపేటలోని ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. త్రినాథ చక్రవర్తి, రాంబాబు స్వాముల నేతృత్వంలో స్వామివారికి పంచామృతాభిషేకం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, మండలి సభ్యుడు ఈమని మదన్ మోహన్ పాల్గొన్నారు.

ఘనంగా కోదండరామ స్వామి తిరునాళ్ల

పామూరు: మండలంలోని కంబాలదిన్నె గ్రామంలోని కోదండరామస్వామి తిరునాళ్ల రుత్వికుల వేదమంత్రాల నడుమ గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఆలయ అర్చకులు సీతా, రామ, లక్ష్మణ, హనుమంతుని మూల విగ్రహమూర్తులకు అభిషేకం నిర్వహించారు. అనంతరం సామూహిక కుంకుమపూజ నిర్వహించారు.

ఘనంగా నరసింహ స్వామి జయంతి

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధి చెందిన పాత సింగరాయకొండ శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో గురువారం జయంతి సందర్భంగా అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు, ఈఓ పి. కృష్ణవేణి పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా ఆదిదేవుడి కల్యాణం

యద్దనపూడి: మండలంలోని పూనూరు గ్రామంలో వేంచేసి ఉన్న త్రిపుర సుందరి సమేత త్రిపురాంతకస్వామి, భద్రకాళి సమేత వీరభద్రస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని గురువారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏడాది నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా అర్చకులు మూలంరాజ్ రాజ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ధ్వజారోహణం, సంప్రోక్షణ పూజలు, హోమాలు నిర్వహించారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌లకు సుప్రభాత సేవలు, పంచామృతాభిషేకాలు నిర్వహించి మూలవిరాట్‌లకు సువర్ణ, రత్న, నాగాభరణ అలంకారాలు, విశేష పూజలు చేశారు. సాయంత్రం 5 గంటలకు స్వామివార్ల కల్యాణ రాయబారం నిర్వహించి రాత్రి 7గంటలకు ఉత్సవమూర్తులను పసిడి, రజిత ఆభరణాలతో, పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ముమ్మారు గర్భగుడి ప్రదక్షిణ అనంతరం 8 గంటలకు నందివాహనంపై కొలువై ఉండగా అర్చకులు స్వామివారి ఉత్సవరులను ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై ప్రతిష్ఠించారు. కల్యాణ క్రతువును, శైవాగమ ప్రతిష్ఠాచార్యులు నాదెండ్ల విశ్వేశ్వరశర్మ, రామేశ్వర్ గురుకుల్ ఆధ్వర్యంలో కల్యాణ క్రతువును నిర్వహించారు. కల్యాణ ఉభయదాతలు దరువూరి వీరయ్య దంపతులు స్వామివారి కల్యాణానికి తలంబ్రాలు, కల్యాణ వస్త్రాలు సమర్పించారు.

రీ సర్వే త్వరగా పూర్తి చేయాలి

- రీ సర్వేను పరిశీలించిన ఆర్డీవో విశ్వేశ్వరరావు



ఏడుగుండ్లపాడు వద్ద రీ సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో విశ్వేశ్వరరావు, తహసీల్దార్

మద్దిపాడు: భూముల రీ సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆర్డీవో విశ్వేశ్వరరావు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మండలంలో జరుగుతున్న భూముల రీ సర్వే పనులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రతిరోజూ 35 ఎకరాలకుపైగా రీసర్వే నిర్వహించాలని వీఆర్వోలను ఆదేశించారు. ఇప్పటి వరకూ జరిగిన రీసర్వే పనులపై గ్రామాల వారీగా సమీక్షించారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్లు రోజులో ఎక్కువ సమయాన్ని రీసర్వే పనులకు కేటాయించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం రీసర్వే జరుగుతున్న ఆరు గ్రామాల్లో త్వరితగతిన రీసర్వే ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. పట్టాదారులు ఎవరైనా మరణించి ఉంటే చట్టబద్ధమైన వారసులకు ఎటువంటి మరణ ధ్రువీకరణ పత్రం, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం లేకపోయినా గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆయా వ్యక్తులకు పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని ఆదేశించారు. రీ సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో ప్రతి సర్వే నంబర్‌కు సంబంధించిన పట్టాదారు వివరాలు ఆన్‌లైన్‌లో పూర్తిగా నమోదు చేయాలని ఆదేశించారు. జగనన్న కాలనీలలో ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో ఇంకా ఇళ్ల నిర్మాణం చేయకుండా ఖాళీగా ఉంచిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించుకోవాలని నోటీసులు జారీ చేయాలన్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ రజనీకుమారి, డీటీ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ బాబూరావు, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను అనాథలను చేస్తే చట్టపరమైన చర్యలు



టోల్ ఫ్రీ నంబర్ వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

కొత్తపట్నం: తల్లిదండ్రుల ఆస్తులను పిల్లలు తీసుకున్న అనంతరం వారిని చూడకుండా అనాథలుగా వదిలేస్తే 2007 మెయింటెనెన్స్ చట్టం ప్రకారం శిక్షార్హులవుతారని కొత్తపట్నం సర్పంచ్ మాకాని వెంకటశ్రావణి అన్నారు. కొత్తపట్నం పంచాయతీ కార్యాలయ ఆవరణలో హెల్ప్ ఏజీ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007పై అవగాహన కల్పించారు. హెల్ప్ ఏజీ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఫీల్డ్ రెస్పాన్సిబిలిటీ ఆఫీసర్ పాటిబళ్ల జాన్‌బాబు మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆస్తి తీసుకుని, ప్రభుత్వం ఉద్యోగం అయి ఉండి తల్లిదండ్రులను పట్టించుకోకపోతే టోల్‌ఫ్రీ నంబర్ 14567కు ఫోన్ చేస్తే వారికి ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. వారికి అవగాహన కల్పించి అన్ని విధాలుగా చూసే విధంగా చేస్తామన్నారు. ఎంత చెప్పినా వినకపోతే ఆర్డీవో ద్వారా నోటీసులు పంపించి వారిని పిలిపించి కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. ఆర్డీవో దగ్గర పరిష్కారం కాకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వారిని అన్ని విధాలుగా చూసేందుకు మాట్లాడి నచ్చజెబుతామన్నారు. తల్లిదండ్రులకు పోషణ ఖర్చుల నిమిత్తం నెలకు రూ.10 వేలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. 14567 వాల్‌పోస్టర్లను ఈ సందర్భంగా విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, ఏపీవో రత్నజ్యోత్స్న, ఎంపీటీసీ రామలింగం వెంకట్రావు, పంచాయతీ మెంబర్ పురిణి గోపి, పంచాయతీ కార్యదర్శి సునీత, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తితో మెలగాలి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కొమ్మూరి కనకారావు

నాగులుప్పలపాడు: క్రీడాకారులు క్రీడల్లో ఎలాంటి భేషజాలకు పోకుండా క్రీడాస్ఫూర్తితో మెలగాలని మాదిగ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ కొమ్మూరి కనకారావు అన్నారు. మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో జె.వై.ఎస్, రాజేష్ మెమోరియల్ ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే జట్లు ఐక్యతతో, సోదరభావంతో మెలగాలని సూచించారు. అనంతరం తొలి మ్యాచ్‌లో తలపడనున్న జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో మద్దిసాని రాజేష్, తెలగతోటి పృథ్వి, బలేన్‌రావు, ప్రకాశం, నిర్వాహకులు పాల్గొన్నారు.

పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలి



సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస రెడ్డి, ఎంఈవో కిషోర్‌బాబు

ఒంగోలు రూరల్: మండలంలోని బడి ఈడు చిన్నారులందరినీ తప్పనిసరిగా సమీప పాఠశాలల్లో చేర్పించాలని ఒంగోలు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి సచివాలయాల సిబ్బంది, ఉపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన సమావేశానికి ఎంపీడీవో అధ్యక్షత వహించగా, ఎంఈవో కిషోర్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒంగోలు మండలంలోని పాఠశాలలను నాడు-నేడు ద్వారా అభివృద్ధి చేసినట్లు వివరించారు. నాడు-నేడు కార్యక్రమాలపై సమీక్షించారు. వెల్ఫేర్ అసిస్టెంట్లకు పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ఎంఈవో కార్యాలయ సిబ్బంది, నాడు-నేడు ఇంజినీర్లు పాల్గొన్నారు.

గొంతు ఆపరేషన్‌కు ఆర్థికసాయం



బాలుడికి ఆర్థికసాయం అందిస్తున్న సూర్యశ్రీ ట్రస్ట్ సభ్యులు

ఒంగోలు అర్బన్: బాలుడి గొంతు ఆపరేషన్ కోసం సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ రూ.30 వేలు ఆర్థిక సహాయం అందించింది. గురువారం ట్రస్ట్ కార్యాలయంలో బాధితుడికి చెక్కు అందజేశారు. నగరపాలక సంస్థ పరిధిలోని పేర్నమిట్టకు చెందిన తన్నీరు రాఘవేంద్ర అనే బాలుడు డాబాపై ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ కిందపడటంతో స్వరపేటిక దెబ్బతింది. బాలుడి తండ్రి ఆంజనేయులు దాదాపు నాలుగు లక్షల రూపాయలు ఖర్చు చేసి వైద్యం చేయించినా ఫలితం లేకపోవడంతో చెన్నైలో మెరుగైన వైద్యం కోసం తీసుకెళ్లారు. సుమారు రూ.లక్ష ఖర్చవుతుందని వైద్యులు తెలపడంతో స్థానికుల ద్వారా తెలుసుకున్న బాలుడి తండ్రి.. సూర్యశ్రీ ట్రస్టును సంప్రదించారు. స్పందించిన ట్రస్టు సభ్యులు.. ప్రవాస భారతీయుడు ఆర్ల శ్రీరామమూర్తి ద్వారా రూ.30 వేలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు: ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి డీఈవో పి.రమేష్‌కు విజ్ఞప్తి చేశారు. డీఈవో చాంబరులో గురువారం కలిసి ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయుల పీఎఫ్‌కు సంబంధించి జిల్లా పరిషత్ సీఈవోకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలని, ప్రభుత్వానికి ఆస్తులతో సహా ఎయిడెడ్ పాఠశాలలను స్వాధీనం చేసిన ఉపాధ్యాయులకు ఎంఈవో హెడ్ నుంచి జీతాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. విద్యార్థులు లేని పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల జాబితాను విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌కు పంపాలని, ప్రభుత్వానికి సరెండర్ చేసిన ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని కోరారు.

స్తంభం పైనుంచి పడి గాయాలు

ఉలవపాడు: విద్యుత్ స్తంభంపై పనులు చేస్తూ జారి పడటంతో వ్యక్తికి గాయాలు అయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని మన్నేటికోటలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మన్నేటికోటకు చెందిన చిమ్మిరి రవి స్తంభం పైకి ఎక్కి వైర్లు బిగిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. దీంతో తలకు గాయాలు కావడంతో ఉలవపాడు పీహెచ్‌సీ వైద్యశాలకు తరలించారు.

ఘనంగా పోలేరమ్మ పూజలు



పీసీపల్లి: పూజలు చేస్తున్న మహిళలు

పీసీపల్లి: మండల పరిధిలోని కమ్మవారిపల్లిలో పోలేరమ్మ, బంగారమ్మ, పోతురాజులకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహాలకు అభిషేకాలు, కలశ పూజలు చేశారు. ప్రతిష్ఠ కార్యక్రమాలను వీక్షించేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

పొన్నలూరు: మండలంలోని ఉప్పలదిన్నెలో పేకాట ఆడుతున్న ముగ్గురు జూదరులను స్థానిక పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై దాసరి రాజారావు తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న జూదరులను అదుపులోకి తీసుకొని వారి దగ్గర నుంచి రూ. 1210 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసు

సింగరాయకొండ: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని ఎస్సై ఫిరోజ్‌ఫాతిమా హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం కౌన్సెలింగ్ ఇచ్చారు.10 మంది పై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు. ఏఎస్సై షేక్ మహబూబ్ బేగ్, సిబ్బంది పాల్గొన్నారు.

దమ్ముంటే ఆధారాలతో నిరూపించు

- అమెరికాలో ఉండి చెత్తవాగుడు వాగడం మానుకో
- నాపై ఆరోపణలు నిరూపిస్తే తక్షణమే కార్పొరేటర్ పదవికి రాజీనామా
- మీడియా సమావేశంలో డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు

ఒంగోలు: అమెరికాలో ఉండి చెత్తవాగుడు వాగి అసత్య ఆరోపణలు చేయడం సరికాదని, దమ్ముంటే తనపై చేసిన ఆరోపణలను ఆధారాలతో సహా నిరూపించాలని పంచ్ ప్రభాకర్‌కు ఒంగోలు డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు సవాల్ విసిరారు. స్థానిక రాజీవ్‌నగర్‌లోని తన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం ప్రభాకర్ బంధువుకు సంబంధించిన ఒక ఘటనను దృష్టిలో ఉంచుకుని తనపై అసత్య ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. తాను 1992లోనే డిగ్రీ పూర్తిచేశానని, రెండు సార్లు కౌన్సిలర్‌గా, నేడు డిప్యూటీ మేయర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నానని తెలిపారు. తాను చదువుకోలేదని ఆరోపించడం ప్రభాకర్ అవివేకానికి నిదర్శనమన్నారు. ఒంగోలు రూరల్ గ్రామ సర్వే నంబర్‌లో ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన దేవతు ముసలారావుకు సంబంధించిన ఆస్తిని రెడ్డి సామాజికవర్గానికి చెందిన ఒకరు ఆక్రమించి కనీసం కొలతలు కూడా వేయనీయకుండా అడ్డుకున్నారని, ఆ వ్యక్తి పంచ్ ప్రభాకర్‌కు బంధువని అన్నారు. చివరకు వారు కోర్టును ఆశ్రయిస్తే కోర్టు కమిషన్ ద్వారా కూడా కొలతలు వేయకుండా అడ్డుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో పంచ్ ప్రభాకర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. గద్దలగుంట, రాజీవ్‌నగర్‌లోని కొంతమంది బ్రోకర్లు, ఒంగోలు రిజిస్ట్రార్ కార్యాలయంలో కీలక వ్యక్తులు కలిసి రాజీవ్‌నగర్ టౌన్ సర్వే నంబర్ 706/1 అప్రూవ్డ్ లే అవుట్‌లో మున్సిపాల్టీ వారికి నాలుగు రోడ్లు, కాలువలు, లైటింగ్, డెవలప్‌మెంట్ కోసం మార్టిగేజ్ చేసిన వందల గదుల స్థలాన్ని దొంగ రిజిస్ట్రేషన్‌లు చేసి కాజేయడానికి యత్నించారన్నారు. ఈ ఆస్తికి సంబంధించి నవులూరి వెంకట రవిప్రసాద్ తనను సంప్రదించగా వారిని పిలిచి మాట్లాడి వాస్తవాలను వివరించి వారిచే దొంగ రిజిస్ట్రేషన్లు క్యాన్సిల్ చేయించడం జరిగిందన్నారు. సర్వే నంబర్ 274లో 1.66 ఎకరాల పొలం ఆక్రమణకు గురైందని, ఫిర్యాదు ఇచ్చినా ఎవరు పట్టించుకోవడంలేదని, 75 సంవత్సరాల వయసు గల తన తల్లి వెళ్లి అడిగితే ఆమెపై దాడికి యత్నించారని తన స్నేహితుడు నవులూరి వెంకట రవిప్రసాద్ తన దృష్టికి తెచ్చాడన్నారు. దీంతో రీ సర్వే జరుగుతున్న దృష్ట్యా డాక్యుమెంట్లన్నీ రీసర్వే అథారిటీకి సబ్‌మిట్ చేయమని చెప్పడం జరిగిందన్నారు. అతను తనకు స్నేహితుడైనందున, అమెరికాలో ఉంటున్నందువలన ఆస్తికి సంబంధించి తనకు జనరల్ పవర్ ఇచ్చి ఉన్నారని, దీనిపై లోతుగా విచారించగా దొంగ ఖాతా నంబర్ పాసుబుక్‌తో పంతులు వద్ద నుంచి కొన్నట్లుగా బినామీ పేర్లతో ఆస్తిని కాజేసినట్లు గుర్తించామని వెలనాటి వివరించారు. దీనిపై అవినీతి నిరోధకశాఖ, విజిలెన్స్ విభాగానికి కూడా లేఖ రాస్తున్నట్లు పేర్కొన్నారు. తనపై వచ్చిన ఆరోపణలు రుజువు చేస్తే డిప్యూటీ మేయర్ పదవితోపాటు కార్పొరేటర్ పదవికి కూడా రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. విలేకరుల సమావేశంలో 32వ డివిజన్ కార్పొరేటర్ తాడి కృష్ణలత, మరో కార్పొరేటర్ ఆదిపూడి గిరిజా శంకర శాండ్యీ పాల్గొన్నారు.

రోడ్డు వివాదం పరిష్కారం



వివాదాన్ని పరిష్కరిస్తున్న తహసీల్దార్ రమణారావు, ఎంపీడీవో సుజాత, ఎస్సై సాంబశివరావు

రంగాయపాలెం (కొత్తపట్నం): రంగాయపాలెం గ్రామంలో రోడ్డు వివాదాన్ని తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంపీడీవో సుజాత, ఎస్సై సాంబశివరావు గురువారం పరిష్కరించారు. వారం రోజుల నుంచి రైతు - గ్రామస్తుల మధ్య రహదారి వివాదం జరుగుతోంది. వారిద్దరూ తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతి చెందిన వారిని శ్మశానానికి తీసుకెళ్లేందుకు రహదారి అవసరమని, అదే విధంగా రైతు పొలంలో పండించే ధాన్యం, కూరగాయలు, ఎరువుల రవాణాకు కూడా రహదారి అవసరమని ఇరువురికీ నచ్చజెప్పారు. గ్రామస్తులను శ్మశానానికి తీసుకెళ్లడానికి 10 అడుగుల బాటకు కొలతలు కొలిచి హద్దు రాళ్లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా రైతు పొలానికి రాకపోకలు సాగించేందుకు కొలతలు కొలిచి రోడ్డును కేటాయించారు. దీంతో సమస్య పరిష్కారం కావడంతో అధికారులకు గ్రామస్తులు, రైతు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గాలి మునలారెడ్డి, కె.పల్లెపాలెం సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనంద్‌రావు, గుండమాల సర్పంచ్ కారాని జయరావు, కాపు సింగోతు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

బ్లడ్ సంజీవని వాహనం ప్రారంభం



బ్లడ్ సంజీవని కారును ప్రారంభిస్తున్న మారం వెంకారెడ్డి, డాక్టర్ జవహర్, బదరీనారాయణ

చీమకుర్తి: రెడ్ డ్రాప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్లడ్ సంజీవని వాహనాన్ని ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి, లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీ జవహర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చలువాది బదరీనారాయణ గురువారం ప్రారంభించారు. చీమకుర్తిలోని డాక్టర్ జవహర్ నర్సింగ్ హోమ్ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం కావాల్సిన వారికి రక్తాన్ని దానం చేసే దాతలను ఆయా ప్రాంతాలకు తీసుకెళ్లేందుకు ఆర్‌డీఎఫ్ తరఫున బ్లడ్ సంజీవని వాహనాన్ని ఉపయోగించనున్నట్లు ఆర్‌డీఎఫ్ అధ్యక్షుడు ఇస్తర్ల శంకర్ తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, కో ఆప్షన్ సభ్యులు షేక్ ఖాదర్‌బాషా, చింతకింది అశోక్, కడవా రామకృష్ణ, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన



విద్యుత్ ప్రభల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఒంగోలు రూరల్: మండలంలోని యరజర్ల గ్రామంలో గల గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధన మహోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రభాతసేవ అనంతరం వేదపండితులు గీతాపారాయణం నిర్వహించారు. యరజర్ల, చెరుకుకొమ్ముపాలెం గ్రామస్తులు భారీగా పాల్గొన్నారు. సహస్రనామ పూజా కార్యక్రమాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం మహానివేదన కార్యక్రమం జరిగింది. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం యరజర్ల గ్రామస్తులు, చెరువుకొమ్ముపాలెం గ్రామస్తులు నాలుగు భారీ విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు, వినోద కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. 2 వైఎస్సార్ సీపీ విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేయగా, ప్రతిపక్ష పార్టీలు 2 ప్రభలు ఏర్పాటు చేశాయి. చెరువుకొమ్ముపాలెం, వెంగముక్కలపాలెం, యరజర్ల, పెళ్లూరు, ఒంగోలు నగరానికి చెందిన భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. మొక్కుబడుల ప్రభలు ఏర్పాటు చేసి యరజర్ల గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆయా కార్యక్రమాలను ముప్పనేని నాగరాజకుమార్, ఆలయ ధర్మకర్తలు పర్యవేక్షించారు.

వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం



గుడ్లూరులో కల్యాణాన్ని తిలకిస్తున్న వేద పండితులు



జమ్ములపాలెంలో శాంతి కల్యాణం

గుడ్లూరు: మండలంలోని తెట్టుకొండపై వెలిసియున్న లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో లక్ష్మీ నరసింహస్వామి జయంతి సందర్భంగా స్వామి కల్యాణం మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి కేశవాచార్యులు ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లకు ఉదయం చందనోత్సవం, ప్రత్యేక పూజలు, అభిషేకం, పూర్ణాహుతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను పట్టు వస్త్రాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. వేదపండితుల వేద మంత్రాల నడుమ స్వామి అమ్మవార్ల శాంతి కల్యాణాన్ని కన్నులపండుగగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

చెన్నకేశవస్వామి కల్యాణం

చిన్నగొల్లపల్లి, (హనుమంతునిపాడు): మండల పరిధి నల్లగండ్ల పంచాయతీ చిన్నగొల్లపల్లి నాగులేటి ఒడ్డున వెలసిన ప్రసిద్ధి గాంచిన లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణ మహోత్సవం గురువారం నిర్వహించారు. వేద మంత్రాల నడుమ వైభవోపేతంగా జరిపించారు. 6, 7వ తేదీన పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త, కమిటీ సభ్యులు తెలిపారు.

కనిగిరి రూరల్: స్థానిక దేవాంగనగర్‌లోని కేటీఆర్ టెక్నో స్కూల్ ఆవరణలో గల శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో గురువారం నరసింహస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ శాశ్వత ధర్మ కర్త కుందురు తిరుపతిరెడ్డి దంపతులు, వాసవీ సత్రసముదాయ జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి, సాయి బాబాదేవస్థాన కమిటీ అధ్యక్షుడు దేవకి సుబ్రహ్మణ్యం, వాగిచర్ల వెంకటేశ్వర్లు, ఉప్పాల నరసింహారావు, నున్నా కృష్ణా, ఈర్ల విజయరామ రాజు, బైరపు కృష్ణ పాల్గొన్నారు.

టంగుటూరు: జమ్ములపాలెంలో శ్రీ లక్ష్మీనృసింహ స్వామి జయంతి గురువారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి శాంతి కల్యాణం గొట్టిముక్కల కృష్ణంరాజు రమాదేవితో నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజలు, భక్తుల సహాయ సహకారాలతో భారీ అన్న సంతర్పణ జరిగింది.